RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 143 | జూన్ 22 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 143 | JUN 22 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

**కట్లపాముతో చెలగాటం.. కాటికి యువకుడు** 2

# కరోనా కలకలం

## ముంబైలో ఏడుగురికి పాజిటివ్



**ముంబై జనసంఘర్షణ**
మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంలో రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వాతావరణ మార్పుల వల్ల వైరల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గత కొన్ని వారాలుగా నగరంలో కోవిడ్-19, స్వైన్ ఫ్లూ ఇన్ఫ్లుయెంజా వంటి ప్రమాదకర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో ముంబైలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగుల రాకతో నిండిపోతున్నాయి. ఒకే రకమైన లక్షణాలు.. పరీక్షలతోనే గుర్తింపు తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, ఎడతెరిపి లేని దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలతో వందలాది మంది ప్రజలు ప్రతిరోజూ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. గత నెల రోజులుగా స్వైన్ ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదవగా, గత వారం రోజులుగా కోవిడ్ పాజిటివ్ కేసులు కూడా మళ్లీ పెరుగుతున్నాయని ముంబై వైద్యులు వెల్లడించారు. ప్రముఖ బ్రీచ్ క్యాండీ వంటి ఆసుపత్రుల ల్యాబొరేటరీలలో రోజుకు కనీసం 7కు పైగా కోవిడ్ లేదా హెచ్1ఎన్1 కేసులు నిర్ధారణ అవుతున్నాయి. వేర్వేరు వైరస్‌లు ఒకే సమయంలో వ్యాప్తి చెందుతుండటం, వాటి లక్షణాలు కూడా ఒకేలా ఉండటంతో ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ కోసం డాక్టర్లు పీసీఆర్ టెస్టులను సిఫార్సు చేస్తున్నారు. రుతుపవనాలు సకాలంలో రాకపోవడం, వాతావరణంలో విపరీతంగా పెరిగిన తేమ శాతమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణమని ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజ) ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా వివరించారు. ఈ తరహా వాతావరణం వల్ల వైరస్‌లు

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రశాంతంగా ముగిసిన నీట్





**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ రీటెస్ట్ అత్యంత కఠినమైన భద్రతా ప్రమాణాల మధ్య ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 551 ప్రత్యేక పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు ఈ ఎగ్జామ్‌కు హాజరయ్యారు. అయితే, పరీక్ష రాసిన అనంతరం అభ్యర్థుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. గతంతో పోలిస్తే ఈసారి క్వశ్చన్ పేపర్ చాలా టఫ్‌గా (కఠినంగా) వచ్చిందని పలువురు అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఫిజిక్స్ (భౌతికశాస్త్రం) ప్రశ్నలు చాలా లెంగ్తీగా, సమయం తీసుకునే విధంగా వచ్చాయని తెలిపారు. కెమిస్ట్రీ (రసాయనశాస్త్రం) పేపర్ కూడా కొంత హార్డ్‌గా అనిపించినప్పటికీ, బయోలజీ (జీవశాస్త్రం) ప్రశ్నలు మాత్రం సులభంగా,

➤ మిగతా 2వ పేజిలో..

# మళ్లీ దాడులు చేస్తాం

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
అంతర్జాతీయ వేదికపై పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. స్విట్జర్లాండ్ దేశంలో ఇరుపక్షాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు దౌత్యపరమైన చర్చలు జరుగుతున్న కీలక సమయంలోనే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ దేశానికి అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ గనుక తన దూకుడు వైఖరిని మార్చుకోకపోతే తాము మరోసారి సైనిక దాడులు చేయడానికి వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా లెబనాన్ దేశంలో ఇరాన్ తన ప్రాక్సీల (పరోక్ష శక్తుల) ద్వారా సృష్టిస్తున్న అంతర్గత కల్లోలాలు, హింసాత్మక సమస్యలను తక్షణమే ఆపివేయాలని ట్రంప్ డిమాండ్ చేశారు. పశ్చిమాసియాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇరాన్ చర్యలను అమెరికా ఎంతమాత్రం సహించబోదనే సంకేతాన్ని ఈ వ్యాఖ్యల ద్వారా ఆయన పంపారు. 'ట్రూత్ సోషల్' వేదికగా వార్నింగ్.. మరింత తీవ్రంగా దెబ్బతీస్తాం! అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. "లెబనాన్‌లో ఇరాన్ పరోక్షంగా సృష్టిస్తున్న సమస్యలను వెంటనే ఆపాలి. ఒకవేళ వారు తమ పద్ధతిని మార్చుకోకుండా ఇలాగే మొండిగా ముందుకు వెళ్తే.. గత వారం మేము చేసిన సైనిక దాడుల మాదిరిగానే మరోసారి తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి

➤ మిగతా 2వ పేజిలో..

# 'బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌కు 25 వసంతాలు

## హాజరుకానున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**హైదరాబాద్ జనసంఘర్షణ**
పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ అత్యాధునిక క్యాన్సర్ వైద్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఆశయంతో ప్రారంభమైన 'బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' విజయవంతంగా 25 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సిల్వర్ జూబ్లీ (రజతోత్సవ) మైలురాయిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో సోమవారం ఘనంగా వేడుకలు జరగనున్నాయి. ఆసుపత్రి ఛైర్మన్, ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరగబోయే ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ఎన్టీఆర్ సంకల్పం.. 100 పడకల నుంచి 650 పడకల ప్రస్థానం! టాలీవుడ్ లెజెండ్, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారు తన సతీమణి బసవతారకం గారి చివరి కోరిక మేరకు ఈ ఆసుపత్రి నిర్మాణానికి పునాది వేశారు. సామాన్యులకు సైతం క్యాన్సర్ వైద్యం అందాలన్న లక్ష్యంతో 1988లో ఆయన ఈ సంకల్పానికి

➤ మిగతా 2వ పేజిలో..

# నీట్‌కు ఉచిత ఫ్రీబస్‌పై హర్షం

**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణలో నేడు జరిగిన రీ-నీట్ పునఃపరీక్ష రాసే అభ్యర్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఉచిత టీజీఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం

➤ మిగతా 2వ పేజిలో..

# తమిళనాడులో ఘోర ప్రమాదం

**జనసంఘర్షణ చెన్నై**
తమిళనాడులో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. సముద్ర ఆహార యూనిట్‌లో అమోనియా గ్యాస్ లీకై ఏడుగురు మహిళలు చనిపోయారు. 67 మందికి పైగా అస్వస్థతకు గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. తమిళనాడులో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. సముద్ర ఆహార యూనిట్‌లో అమోనియా గ్యాస్ లీకై ఏడుగురు

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రశాంతంగా ముగిసిన నీట్

**మొదటిపేజీ తరువాయి..** బాగున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక పరీక్షకు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రెండు రాష్ట్రాల నుండి సుమారు 3.65 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, ఈ పరీక్షలో దివ్యాంగులైన (గ్రాఎ) విద్యార్థుల సౌకర్యార్థం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. వారికి అదనపు సమయాన్ని కేటాయిస్తూ, సాయంత్రం 6:20 గంటల వరకు పరీక్ష రాసుకునేందుకు వీలుగా ప్రత్యేక అవకాశం కల్పించడం గమనార్హం.

# 'బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌కు 25 వసంతాలు

**మొదటిపేజీ తరువాయి...** అంకురార్పణ చేశారు. ప్రవాస భారతీయులు, వైద్య ప్రముఖులు, ఎందరో దాతల ఆర్థిక సాయంతో రూపుదిద్దుకున్న ఈ ఆసుపత్రిని 2000 సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 100 పడకల సామర్థ్యంతో ప్రారంభించారు. కాలక్రమేణా సేవల విస్తరణతో నేడు 650 పడకల అత్యాధునిక మల్టీ-స్పెషాలిటీ క్యాన్సర్ కేర్ సెంటర్‌గా దేశంలోనే అగ్రగామిగా నిలిచింది.

తండ్రి ఆశయాన్ని కొనసాగిస్తున్న బాలకృష్ణ

ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ ఈ సంస్థకు ఛైర్మన్ మరియు మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ తన తండ్రి ఆశయాన్ని ఒక పవిత్ర యజ్ఞంలా ముందుకు తీసుకెళ్తున్నారు. ఆయన సారథ్యంలో ఈ ఆసుపత్రి ఏటా సుమారు 3 లక్షల మందికి పైగా అవుట్ పేషెంట్లకు, 90 వేల మంది ఇన్ పేషెంట్లకు సేవలు అందిస్తోంది. ఇక్కడికి వచ్చే రోగులలో 65 శాతానికి పైగా పేద వర్గాల వారే కావడం విశేషం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ వేలాది మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ 8 వేలకు పైగా క్లిష్టమైన క్యాన్సర్ సర్జరీలు, 86 బోన్ మ్యారో మార్పిడి చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు.

సేవా మార్గంలో మొబైల్ స్క్రీనింగ్ బస్సులు

కేవలం ఆసుపత్రికే పరిమితం కాకుండా, క్యాన్సర్ వ్యాధిపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యాజమాన్యం ప్రత్యేక మొబైల్ స్క్రీనింగ్ బస్సులను నడుపుతోంది. దీని ద్వారా మారుమూల పల్లెలు, గిరిజన ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తున్నారు. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాలలో దాదాపు 250 మంది నిపుణులైన డాక్టర్లు ఇక్కడ సేవలందిస్తున్నారు. సోమవారం నాడు జరగబోయే ఈ చారిత్రాత్మక రజతోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబుతో పాటు ఇరు రాష్ట్రాల రాజకీయ నేతలు, సినీ గ్లామర్, వైద్య రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆసుపత్రి పాతికేళ్ల నిరంతర సేవలను కొనియాడనున్నారు.

## కట్లపాములతో చెలగాటం

### ప్రాణం కోల్పోయిన యువకుడు

**హైదరాబాద్, :** పాముతో చెలగాటం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్నేహితులను భయపెట్టాలని ఆ వ్యక్తి చేసిన పిచ్చి పని అతని ప్రాణాలను బలితీసుకుంది. ఫామ్‌హౌస్‌లో కనిపించిన కట్లపాము పిల్లను చేతిలో తీసుకుని పరచకాలు ఆడటంతో.. అది కాటువేసింది. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన నవాబ్ జయ్యద్ ఖుమైద్ మొహిద్దీన్ (30) ఒక వ్యాపారవేత్త. తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. వారితో సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడకు ఒక కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పాముతో తన స్నేహితును భయపెట్టాలని అనుకున్నాడు. ఆ కట్ల పాముతో ఆటలు ఆడుతూ స్నేహితులను భయపెట్టబోయాడు. కానీ ఇంతలో కుడి చేతి బొటనవేలుపై కాటేసింది. చిన్న పాము కదా.. పెద్దగా ప్రమాదం ఉండదని వాబ్ లైట్ తీసుకున్నాడు. స్నేహితుల ముందు నవ్వుకుంటూ.. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అవసరం లేదని స్నేహితులతో చెప్పుకొచ్చాడు. కానీ చిన్నదైనా, పెద్దదైనా కట్లపాము విషం అత్యంత ప్రమాదకరమేని అతను తెలుసుకోలేకపోయాడు. ఇంకేముంది.. కొద్దిసేపట్లోనే కట్ల పాము విషం నవాబ్ శరీరంపై ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ముందుగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. క్రమంగా

# కరోనా కలకలం

**మొదటిపేజీ తరువాయి..** గాలిలో ఎక్కువ సమయం సజీవంగా ఉంటాయని తెలిపారు. నగరంలో వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం చల్లబడి, గాలి శుద్ధి అవుతుందని, తద్వారా వైరల్ వ్యాధుల తీవ్రత తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

వైద్యుల హెచ్చరిక: సొంత వైద్యం వద్దు!

ప్రస్తుతం విస్తరిస్తున్న ఇన్ఫెక్షన్ల లక్షణాలు తీవ్రంగా లేకపోయినప్పటికీ.. వృద్ధులు, గర్భిణులు, డయాబెటిస్ (మధుమేహం) ఉన్నవారు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జ్వరం, దగ్గు రాగానే మెడికల్ షాపులకు వెళ్లి సొంతంగా యాంటీబయాటిక్స్ వాడకూడదని, లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలలో మాస్కులు ధరించడం, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులు నగర ప్రజలను కోరారు.

# మళ్లీ దాడులు చేస్తాం

**మొదటిపేజీ తరువాయి...** ఉంటుంది. ఈసారి జరిగే దాడులు గతంలో కంటే మరింత శక్తివంతంగా, ఇరాన్‌ను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉంటాయి" అని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. గత వారం జరిగిన దాడుల తాలూకు వేడి తగ్గకముందే, శాంతి చర్చల నడుమ ట్రంప్ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి.

# నీట్‌కు ఉచిత ఫ్రీబస్‌పై హర్షం

**మొదటిపేజీ తరువాయి...** చేసుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చొరవ వల్ల అభ్యర్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా, సకాలంలో సురక్షితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోగలిగారని ఆయన పేర్కొన్నారు. బస్సుల్లో విద్యార్థులు చిరునవ్వులతో ప్రయాణించడం చూసి తన మనసు ఎంతగానో ఉప్పొంగిపోయిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాపాడటమే ధ్యేయంగా ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అభ్యర్థుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యతకు ఈ ఉచిత బస్సు సౌకర్యమే నిదర్శనమని ఆయన కొనియాడారు. ఈ వినూత్న నిర్ణయంపై విద్యార్థులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రుల నుండి అద్భుతమైన స్పందన లభించిందని వివరించారు విద్యార్థులు తమ ఉన్నత లక్ష్యాలను సాధించే క్రమంలో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు, వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్న ప్రజా పాలనలో భాగంగా.. కేవలం రవాణా సౌకర్యాలే కాకుండా విద్యార్థుల విద్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల మెరుగుదల కోసం భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

## ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి చిరుత

### కుక్కను చంపి తీసుకెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డు

**ముంబై, జూన్20 :** ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి ఓ చిరుత ప్రవేశించింది. స్టాఫ్ హాస్టల్ ఏరియాలో ఓ కుక్కను చంపేసింది. పోవాయ్‌లో ఉన్న వర్సిటీ సీసీ కెమెరాలకు ఆ ఘటన చిక్కింది. ఈ ఘటన 19వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు జరిగింది. క్యాంపస్‌లోకి చిరుత ప్రవేశించడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లోని రెసిడెన్షియల్ ఏరియాలో చిరుత సంచరిస్తున్నట్లు ఇప్పటికే ఫిర్యాదు ఉన్నది. హాస్టల్ మెట్ల వద్ద ఉన్న ఓ కుక్కను చిరుత తన నోటితో పట్టి చంపేసింది. చాలా నెమ్మదిగా వాకింగ్ చేసుకుంటూ వచ్చిన ఆ చిరుత సడెన్‌గా కుక్కపై దాడి చేసింది. చనిపోయిన కుక్క బాడీతోనే ఆ చిరుత అదృశ్యమైంది. క్యాంపస్ విద్యార్థులు, సిబ్బంది, స్థానికులు ఆ వీడియో చూసి భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి పూట సంచారం ఇబ్బందిగా మారినట్లు ఫిర్యాదు చేశారు. పోవాయ్ సమీపంలో అటవీ ప్రదేశం ఉన్న కారణంగా.. అక్కడ పలు సందర్భాల్లో చిరుతలు కనిపించాయి.

# తమిళనాడులో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి...** మహిళలు చనిపోయారు. 67 మందికి పైగా అస్వస్థతకు గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. తిరువల్లూర్ జిల్లాలోని పెరియపాలెంకు దగ్గర్లో ఉన్న ఎస్టీ పీటర్స్ పాల్ సీఫుడ్స్ ఎక్స్‌పోర్ట్‌లోని రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో ఈ ఘటన జరిగింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి బాధితులను స్థానిక దవాఖానలకు తరలించాయి. అప్పటికే ఏడుగురు తీవ్ర అస్వస్థతతో చనిపోయారని కలెక్టర్ కవిత తెలిపారు. అస్వస్థతకు గురైన వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉందని.. వారిని స్టాన్లే మెడికల్ కాలేజీకి తరలించామన్నారు.

## చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్

**హన్మకొండ, జూన్20 :** చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## మోనాలిసా దంపతులకు రక్షణ

### పోలీసులను ఆదేశించిన కేరళ హైకోర్టు

**తిరువనంతపురం,** 'కుంభమేళా గర్ల్' మోనాలిసాకు భద్రత కల్పించటంపై కేరళ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. మోనాలిసా, ఆమె భర్త మొహమ్మద్ ఫర్మాన్‌కు భద్రత కల్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. మోనాలిసా, మొహమ్మద్ ఫర్మాన్‌కు ఆన్‌లైన్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి.. మార్చి 11వ తేదీన తిరువనంతపురంలోని అరుమనూర్ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత మోనాలిసా వయసుపై తీవ్ర స్థాయిలో విమర్శలు మొదలయ్యాయి. ఫర్మాన్ తన కూతురిని కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్నాడని మోనాలిసా తండ్రి మధ్యప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్'కు ఫిర్యాదు కూడా వెళ్లింది. 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్' మోనాలిసా వయసుపై దర్యాప్తు చేయగా.. ఆమె మైనర్ అని తేలింది. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ దర్యాప్తులో బయటపడ్డ విషయాల మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద మోనాలిసా భర్తపై కేసులు నమోదు చేశారు. మధ్యప్రదేశ్ పోలీసులు ఫర్మాన్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా.. అతడు కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. కేరళ హైకోర్టు ఫర్మాన్ ఖాన్‌ను అరెస్ట్ చేయకుండా స్టే విధించింది. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ కేరళలోనే ఉంటున్నారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందంటూ కొద్దిరోజుల క్రితం మోనాలిసా కేరళ హైకోర్టులో పిటిషన్ వేశారు. మతాంతర వివాహం కారణంగా మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తుల నుంచి తమకు ప్రాణ హాని ఉందని మోనాలిసా తన పిటిషన్‌లో పేర్కొంది. తమకు భద్రత కల్పించేలా ప్రభుత్వానికి, ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

శనివారం మోనాలిసా పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. మోనాలిసా తరఫు న్యాయవాదితో పాటు ప్రభుత్వ ప్లీడర్ వాదనలను విన్న కోర్టు.. పిటిషనర్ ప్రాణానికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని భావించింది. రిట్ పిటిషన్ విచారణ పూర్తయ్యే వరకు మోనాలిసా, ఆమె భర్తకు రక్షణ కల్పించాలని ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను ఆదేశించింది. తదుపరి విచారణను జులై 10వ తేదీకి వాయిదా వేసింది.

## కక్షసాధింపు కోసం ఆర్టీఐ దుర్వినియోగం

### మదనపల్లి డిగ్రీకాలేజీ వ్యవహారంలో ఫిర్యాదు కొట్టివేత

### పదేపదే కావాలనే ఆర్టీఐ దరఖాస్తు చేసినట్లు కమిషన్ గుర్తింపు

**అమరావతి, :** సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ చట్టాన్ని వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి లేదా ప్రభుత్వ అధికారులను వేధించడానికి వినియోగిస్తే సహించబోమని తేల్చి చెప్పింది. పారదర్శకత, జవాబుదారీ తనాన్ని పెంపొందించేందుకు తీసుకొచ్చిన దీన్ని దుర్వినియోగం చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు సంబంధించిన కేసులో ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఫిర్యాదుదారుడు పదేపదే ఆర్టీఐ దరఖాస్తులు దాఖలు చేసి పలువురిని ఇబ్బందులకు గురి చేయడంపై ఆగ్రహించింది. ఈ మేరకు ఫిర్యాదుదారుడి రెండో అప్పీల్‌ను కమిషన్ కొట్టివేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఫిర్యాదుదారుడు పదేపదే ఆర్టీఐ దాఖలు చేసినట్లు విచారణలో వెల్లడైందని కమిషన్ తెలిపింది. ఇప్పటికే అతను కోరిన సమాచారాన్ని

# రామాయంపేట హైవే వై జంక్షన్ వద్ద వెంటనే బ్రిడ్జి నిర్మించాలి..

- ప్రమాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు.
- కేసీఆర్ కాలనీకే చెందిన పదిమందికి పైగా ప్రమాదాల్లో మృతి.
- రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి.
- బ్రిడ్జి మంజూరు చేయకపోతే ధర్నా, రాస్తారోకోకు దిగుతాం.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.





ఉమ్మడి దగ్గర జిల్లా ప్రతినిధి జూన్ 21 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి వెళ్లే 44వ జాతీయ రహదారిపై వై జంక్షన్ వద్ద ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున అక్కడ వెంటనే ఫ్లైఓవర్ లేదా బ్రిడ్జి నిర్మించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ నాయకురాలు ఎం. పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన ప్రజా సేకరణ కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజలు, వాహనదారుల అభిప్రాయాలను ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై రామాయంపేటకు వెళ్లే మార్గంలో తగిన భద్రతా చర్యలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూం నివాసితుల్లో పదిమందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కాలనీవాసులు, విద్యార్థులు, ఉద్యోగులు రహదారి దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాహనాల వేగం కారణంగా ప్రతి రోజూ భయాందోళనల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు.ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ప్రజల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు లేకపోవడం విచారకరమన్నారు. రోడ్డు దాటాలంటే చుక్కలు కనిపించే పరిస్థితి నెలకొందని, ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించేందుకు వై జంక్షన్ వద్ద వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరారు. ప్రజల నుంచి సమస్యపై విశేష స్పందన లభించిందని, వారి అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే ప్రజా సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పద్మా దేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాల వివరాలను తెలుసుకుని, ప్రజల భద్రత దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి రామాయంపేట బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే వాహనదారులు, స్థానిక ప్రజలతో కలిసి ఇదే రహదారిపై ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, వాహనదారులు పాల్గొన్నారు.

# యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం

- అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.






ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21(జన సంఘర్షణ)

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకుని ఆదివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు సిబ్బందికి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పతంజలి మహిళ యోగ సమితికి చెందిన యోగా శిక్షకురాలు మనోరంజని హాజరై వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలను చేయించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హాజరై 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం. శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే గొప్ప సాధన యోగ. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయి. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ప్రతి ఒక్కరికీ అవసరం" అని అన్నారు. ముఖ్యంగా పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి, అలసటను అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని, అందరూ నిత్యజీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందనిపేర్కొన్నారు. యోగా శిక్షణ అందించిన పతంజలి మహిళ యోగ సమితి ప్రతినిధి మనోరంజనికి అదనపు ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సిఐ లు కృష్ణ మూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, రామ కృష్ణ, ఎసై లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు.

# విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీలో సీసీ రోడ్డు శంకుస్థాపన

- ఎమ్మెల్యే, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ రమేష్ బాబు

ఇల్లందు జూన్ 21 (జన సంఘర్షణ)

స్థానిక విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీలో శనివారం ఉపాధి హామీ నిధులతో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. గ్రామపంచాయతీ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ప్రారంభించారు.

**ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు**

ఈ సందర్భంగా సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు మాట్లాడుతూ.. విజయలక్ష్మి నగర్ గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు గాను గౌరవ ఇల్లందు శాసనసభ సభ్యులు కోరం కనకయ్యకి, అలాగే జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్‌కి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

**మరిన్ని నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి**

ప్రస్తుతం శంకుస్థాపన చేసిన రోడ్డు నిర్మాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, మిగిలిన భాగానికి కూడా వీలైనంత త్వరగా అదనపు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు. గ్రామంలోని రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే తమ ప్రథమ ప్రాధాన్యతని ఆయన పేర్కొన్నారు.



**సింగరేణి క్వార్టర్స్ ఏరియా రోడ్లపై వినతి**

దీనితో పాటు, స్థానిక సింగరేణి క్వార్టర్స్ ఏరియాలోని అన్ని వీధులలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని సర్పంచ్ రమేష్ బాబు గుర్తు చేశారు. సింగరేణి క్వార్టర్స్ పరిధిలోని ప్రతి వీధికి సీసీ రోడ్లు మంజూరు చేసి, అక్కడి ప్రజల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించాలని ఆయన ప్రజాప్రతినిధులకు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

**ప్రజాప్రతినిధులు, ప్రముఖుల భాగస్వామ్యం**

ఈ అభివృద్ధి కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులతో పాటు తిలక్ నగర్ సర్పంచ్ స్రవంతి, విజయలక్ష్మి నగర్ ఉప సర్పంచ్ రేణుక, తిలక్ నగర్ ఉప సర్పంచ్ ఖాసీం, మాజీ ఎంపీటీసీ సభ్యులు పూనెం సురేందర్, మాజీ ఉప సర్పంచ్ తాండ్ర నాగరాజు తదితర ముఖ్య నాయకులు పాల్గొని పనుల ప్రారంభాన్ని పర్యవేక్షించారు.

**హాజరైన వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు:**

కార్యక్రమంలో విజయలక్ష్మి నగర్ వార్డు సభ్యులు హరిసింగ్, వెంకటేష్, సదా, మల్లికా, సౌజన్య, కళావతి, అజయ్, భద్రు, వసంతలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎస్కే నభి, హరికృష్ణ, ఇషాద్, శ్రీను, నాని, రాజు, శ్రీకాంత్, లాలు, కుమార్, పూర్ణ, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్-2 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో అగ్నిప్రమాదం

కరీంనగర్ /జూన్ 21/(జన సంఘర్షణ)

కరీంనగర్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ సమీపంలో సాంకేతిక లోపంతో ఆకస్మాత్తుగా చెలరేగిన మంటలు. అప్రమత్తమై ప్రయాణికులను సురక్షితంగా కిందికి దించిన డ్రైవర్, కండక్టర్. పూర్తిగా దగ్ధమైన బస్సు.. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్న అధికారులు




# అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026

- అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ, అమృత్ సరోవర్ చెరువు వద్ద ఘనంగా నిర్వహణ.




ఈ రోజు అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ చెరువు ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ.."యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది ఆరోగ్యకరమైన జీవన విధానం. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత , ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయిస్తే ఒత్తిడి తగ్గి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది. 'యోగ ఫర్ వన్ ఎర్త్ – వన్ హెల్త్' అనే భావనతో ప్రతి ఒక్కరూ యోగను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణవేణి, ఈసీ సుధీర్, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్యారాణి, మేట్ అజ్మీరా సురేష్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొని యోగా యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని ఆరోగ్యకరమైన జీవనానికి యోగను అలవాటు చేసుకోవాలని సంకల్పించారు. "యోగం మన భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం. ఆరోగ్యమే మహాభాగ్యం... యోగమే ఆరోగ్యానికి మార్గం."

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21 (జన సంఘర్షణ)



12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామాయంపేట మండల వ్యాప్తంగా యోగా తరగతులు నిర్వహించామని ఆయుష్ యోగ శిక్షకులు, జాతీయస్థాయి యోగా ప్రదర్శన కారులు మద్దెల భరత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు 3,000 మందికి యోగ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా. నేడు విశ్వవ్యాప్తమైందన్నారు. సరిహద్దులు దాటి ప్రపంచ దేశాలన్నింటినీ ఒకే తాటిపైకి తెచ్చి ప్రతి ఏటా జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది యోగాసనాలతో రోజును ప్రారంభిస్తున్నారన్నారు. శరీరానికి దృఢత్వాన్ని, మనస్సుకు ప్రశాంతతను ఇచ్చే ఈ ప్రాచీన విద్య ప్రాధాన్యతను ఐక్యరాజ్యసమితి గుర్తించి దశాబ్ద కాలం దాటిందనీ.. అప్పటి నుంచి ఇప్పటివరకు యోగా క్రేజ్ వరల్డ్ వైడ్ గా నానాటికీ పెరుగుతూనే ఉందన్నారు.కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# కష్టాల్లో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా...

- సేవా కార్యక్రమాల్లో డా. బాధవత్ రవి
- కష్టాలలో ఉన్న కుటుంబాలకు భరోసా



చిన్నకట్టుగూడెం, జూన్ 21:

ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న డా. బాధవత్ రవి శనివారం చిన్నకట్టుగూడెం గ్రామంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన లకావత్ రాములు, చంటి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న డా. రవి వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. "ఎలాంటి కష్టం వచ్చినా నేను మీకు అండగా ఉంటాను" అంటూ వారికి మనోధైర్యాన్ని నింపారు. ఆపద సమయంలో ఆదుకునే వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమని గ్రామస్తులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బానోత్ భద్రి దశదిన కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేసి తన వంతు సహాయ సహకారాలను అందించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న వారికి సానుభూతి తెలియజేస్తూ, వారి వెంటే ఉంటానని భరోసా కల్పించారు. తదుపరి లకావత్ వీరన్న కుమార్తె శుభకార్యానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజల కష్టాల్లో పరామర్శ, శుభకార్యాల్లో పాల్గొనడం, అవసరమైన వారికి సహాయం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా డా. బాధవత్ రవి ప్రజలకు మరింత చేరువ అవుతున్నారని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణవేణి–వీరబాబు, ఉపసర్పంచ్ శంకర్, కొత్త తండా సర్పంచ్ మంగీలాల్ అజయ్ సురేష్ నరేష్ గాంధీ నాగేశ్వరావు శ్యామ్ సురేష్ యువకులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సబ్ జైలులో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- ముగిసిన 10 రోజుల శిక్షణ
- సబ్ జైలులో యోగా వేడుకలు




ఇల్లందు జూన్ 21 (జన సంఘర్షణ)

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని (జూన్ 21) పురస్కరించుకుని స్థానిక పట్టణంలోని సబ్ జైలు నందు శనివారంతో యోగా శిక్షణ తరగతులు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. గత పది రోజులుగా జైలు ప్రాంగణంలో ఈ ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించారు.

**గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో శిక్షణ**

ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థ 'గాయత్రి పరివార్' ఆధ్వర్యంలో గత పది రోజులుగా ఈ యోగా క్లాసులు నిరంతరాయంగా సాగాయి. ఖైదీలలో మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**యోగా మాస్టర్ పర్యవేక్షణలో ముగింపు**

యోగా దినోత్సవం సందర్భంగా జరిగిన ముగింపు వేడుకలు ప్రముఖ యోగా మాస్టర్ డాక్టర్ సతీష్ ఖండెల్వాల్ పర్యవేక్షణలో జరిగాయి. ఆయన నేతృత్వంలో ముద్దాయిలు (ఖైదీలు), జైలు సిబ్బంది అందరూ కలిసి వివిధ రకాల ఆసనాలు, ప్రాణాయామం మరియు ధ్యానం చేశారు.

**అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం**

ఈ ముగింపు కార్యక్రమంలో జైలు పర్యవేక్షణ అధికారి (జెయిలర్) ఏ. సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు జైలు సిబ్బంది అంతా చొరవ తీసుకుని, ఖైదీలతో కలిసి యోగాసనాలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**మారనున్న ఖైదీల ప్రవర్తన**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. యోగా సాధన ద్వారా ఒత్తిడి తగ్గి మనస్సు అదుపులో ఉంటుందని తెలిపారు. గత పది రోజులుగా నేర్చుకున్న యోగాను ఖైదీలు తమ జీవితంలో భాగం చేసుకుని, భవిష్యత్తులో మంచి ప్రవర్తనతో సమాజంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
సోమవారం
22 జూన్ 2026

# హరిప్రియ నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు ఆధ్వర్యంలో 'సర్' అవగాహన సదస్సు

- ఇల్లందులో బీఆర్ఎస్ శ్రేణుల గర్జన: సభ్యత్వ నమోదు, 'సర్' సదస్సు ఘనం
- పార్టీ బలోపేతమే లక్ష్యం: ఇల్లందులో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు వేడుకలు

ఇల్లందు జూన్ 21 (జన సంఘర్షణ)

**కార్యకర్తలతో సదస్సు**

భారత్ రాష్ట్ర సమితి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇల్లందు నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ అవగాహన సదస్సు నియోజకవర్గ కేంద్రంలో అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది.

**మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ నేతృత్వం**

ఈ కీలక సదస్సు ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు, బీఆర్ఎస్ నాయకురాలు బానోత్ హరిప్రియ హార్సింగ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఆమె దిశానిర్దేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**ఓటరు సవరణ ప్రక్రియపై అవగాహన**


సదస్సులో భాగంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 'సర్' ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ సుదీర్ఘంగా వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంలో ఈ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.

**బి.ఎల్.ఎ ల బాధ్యతలు**

ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలకు వారి బాధ్యతలను గుర్తు చేశారు. ఓటర్లకు అవసరమైన సేవలను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాలని, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలో చురుకైన పాత్ర పోషించాలని నాయకత్వం పిలుపునిచ్చింది.

**జయశంకర్ సార్‌కు ఘన నివాళి**

అనంతరం తెలంగాణ సిద్ధాంతకర్త, గౌరవ ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా సదస్సులో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, తెలంగాణ సాధనలో ఆయన చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు.






**ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి పిలుపు**

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ఎంతో కీలకమైనవని చెప్పారు. ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

**అర్హులందరికీ ఓటు హక్కు**

ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా బీఆర్ఎస్ శ్రేణులు గట్టి కృషి చేయాలని ఎమ్మెల్సీ కోరారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, పార్టీ పరంగా తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు.

**బయ్యారం శ్రేణుల భాగస్వామ్యం:**

ఈ సదస్సులో బయ్యారం మాజీ యూత్ ప్రెసిడెంట్ కీర్తి ఉదయ్‌తో పాటు బయ్యారం మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గంలోని అందరు బి.ఎల్.ఓలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీని మరింత శక్తివంతంగా మార్చేందుకు సభ్యత్వ నమోదును విజయవంతం చేస్తామని అందరూ సంకల్పించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలెక్టర్ ప్రతిమా సింగ్

- ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్.
- మానవ శక్తులన్నింటినీ ఏకం చేసే ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం.
- భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ
- వయో.,లింగ భేదం లేకుండా అందరూ యోగాను సాధన చేయాలి.
- యోగా గురువు రవి అధికారులతో ఆసనాలు చేయించారు.
- కలెక్టర్ ప్రతిమాసింగ్ యోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21 (జన సంఘర్షణ)

ఆదివారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భూక్య జ్ఞానేశ్వర్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్, ఆయుష్ విభాగం మోహన్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, విశిష్ట యోగ గురువు ఆకుల రవి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




ముందుగా కలెక్టర్ ప్రతిమాసింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ప్రతి మాసింగ్ ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి లు స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్ తో ముందుకు సాగాలన్నారు. మానవ శక్తులన్నింటినీ ఏకం చేసే ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం అన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ అని పిలుపునిచ్చారు. "యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు... శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ" అని పేర్కొన్నారు. అనంతరం యోగాలో పాల్గొన్న ఆయుష్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, క్రీడాకారులు






క్రీడాభిమానులతో కలెక్టర్ ఫోటో సెషన్‌లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, విశిష్ట యోగ ఇన్స్ట్రక్టర్ దేవేందర్ రెడ్డి, పిడి ఆనందం, నరసింహులు, కొండల్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళాలు, స్వచ్ఛంద సంస్థలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మకు మొదటి బోనం సమర్పించిన సర్పంచ్

మద్నూర్ మండల్/జూన్ 21 (జన సంఘర్షణ)



మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం నల్ల పోచమ్మ ఊరదేవత బోనాల పండుగ గ్రామ సర్పంచ్ ఉషా-సంతోష్ మేస్త్రీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ గా ఉన్న ఇంటి నుంచే మొదటి బోనం ఐదేండ్ల పాటు దేవతకు సమర్పించాలనే ఆనవాయితీ ఈ గ్రామంలో ఉంది. ఇందులో భాగంగా సర్పంచ్ ఉషా సంతోష్ మేస్త్రీ ఉదయం పూటనే నల్లపోచమ్మకు మొదటి బోనాన్ని సతీసమేతంగా సమర్పించారు. అదేవిధంగా గ్రామస్థులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి, దేవతకు నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి మేకలను బలి ఇచ్చారు. ఊరి ప్రజలంతా చల్లగా ఉండాలని, వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, అన్నదాతకు ఆటంకాలు కలగొద్దని గ్రామస్తుల తరపున సర్పంచ్ దేవతను వేడుకున్నారు. అంతకుముందు నల్లపోచమ్మ గుడి దగ్గర ప్రజల సౌకర్యార్థం సర్పంచ్ కుర్చీలు, త్రాగునీరు, నీడ కోసం టెంటు ఏర్పాటు చేశారు. బోనాల నిర్వహణ ఘనంగా చేసినందుకు గ్రామస్తులు సర్పంచ్ ఉషా-సంతోష్ మేస్త్రీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రుద్రూర్ మండలం కరెంటు అధికారుల తీరుపై మండిపడ్డ సురాజ్ శ్రీనివాస్

రుద్రూరు/జూన్ 21/(జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండల కేంద్రంలోని కరెంట్ అధికారులపై సురాజ్ శ్రీనివాస్ భగ్గుమన్నారు. కారణం చాలామంది చాలా బకాయిలు ఉన్న వారిపై ఎలాంటి యాక్షన్ లేకుండా కనీసం కొంతవరకు చార్జీలు ఉంటే కక్షపూరితంగా తన ఇంటికి వచ్చి వార్త రాసిన పాపానికి తన ఇంటికి వచ్చి సిల్ కరెంట్ మీటర్ను ఎవరు లేని సమయంలో కట్ చేసి నోటీస్ ఇవ్వడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండల కరెంటు అధికారులు ఓ అధికారి వార్తా రాసిన పాపానికి ఇలా చేయడం ఏమిటని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. వ్యాపార సముదాయాలు కానీ ఇతర సముదాయాలలో అనేక బకాయిలు ఉన్నప్పటికీ సుమారు పదివేలకు పైన ఉన్నప్పటికీ వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తనకు నోటీసు ఇవ్వడం వెనుక అంతరాయం ఏమిటని వార్త రాసిన పాపానికి ఇలా చేయడం చాలా దారుణంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు

ఇల్లందు జూన్ 21 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం పరిధిలోని సింగరేణి గెస్ట్ హౌస్ నందు ఆదివారం ఒక ముఖ్యమైన భేటీ జరిగింది. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావుని ఇల్లందు నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గెస్ట్ హౌస్‌కు విచ్చేసిన ఆయనకు నాయకులు ఘనస్వాగతం పలికారు.

**స్థానిక రాజకీయాలపై చర్చ**

ఈ మర్యాదపూర్వక సమావేశంలో భాగంగా ఇల్లందు నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, స్థానిక పరిస్థితులపై నాయకులు రేగా కాంతారావుతో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా సమస్యలపై పోరాటాలు మరియు రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన కార్యాచరణ గురించి ఈ సందర్భంగా ఆయనకు వివరించడం జరిగింది.

**పాల్గొన్న ముఖ్య నాయకులు**

మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీర బావ సింగ్ నాయక్, ఇల్లందు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ సుర్ణపాక సత్యనారాయణ, ఇల్లందు మండల నాయకులు సదరం మహేష్, పోతురెడ్డి సారంగపాణి ఉన్నారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని రేగా కాంతారావు వారికి దిశానిర్దేశం చేశారు.

# నీట్ (యుజి)-2026 రీ-ఎగ్జామినేషన్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21(జన సంఘర్షణ)



జిల్లాలో నిర్వహిస్తున్న నీట్(యుజీ)-2026 రీ-ఎగ్జామినేషన్ సందర్భంగా మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవాంఛనీయ సంఘటనల ఎచోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్-163 అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా నిలబడవద్దని, అనవసర రద్దీ సృష్టించకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, పరీక్షా పత్రాలు పరీక్షా కేంద్రాల నుంచి స్ట్రాంగ్‌రూమ్‌కు భద్రంగా చేరే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. పరీక్షల పారదర్శకత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలో అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అభ్యర్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఖరీఫ్ ధాన్యం ప్రతి గింజ కొనాల్సిందే

- కేంద్రాన్ని సాకుగా చూపితే వదిలేది లేదు.
- అవసరమైతే ప్రభుత్వ మెడలు వంచుతాం.
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21 (జన సంఘర్షణ)




ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని, కేంద్ర ప్రభుత్వాన్ని సాకుగా చూపి బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీ తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తుందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..గత రెండేళ్లుగా ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి పూర్తిగా చేతులెత్తివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరిగితే ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింపజేసేలా ఆందోళనలు చేపడతామని, ప్రతి గింజ కొనుగోలు అయ్యే వరకు తెలంగాణ రైతాంగానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు రైతుబంధు ఎకరాకు రూ.12 వేలుగా పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేంద్రం కొనకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యం కొనాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నాయకులు, నేడు కేంద్రాన్ని సాకుగా చూపడం వారి దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని విమర్శించారు. రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేసే దమ్ము లేకపోయినా, కొన్ని రకాల వరి ధాన్యాలనే పండించాలని సూచించడం రైతులకు నష్టం కలిగించే చర్య అని పేర్కొన్నారు. తక్కువ దిగుబడి వచ్చే రకాల వైపు రైతులను మళ్లించడం ద్వారా కొనుగోలు భారం తగ్గించుకోవాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమంపై దృష్టి సారించి తన వైఖరిని మార్చుకోవాలని, లేకపోతే రైతుల నుంచి భారీ వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని తిరుపతిరెడ్డి హెచ్చరించారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్ సార్‌కు నివాళి

◆ ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం.
◆ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21(జన సంఘర్షణ)



తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయమని పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల. ఆంజనేయులు పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని మెదక్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సేవలు తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించి, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని బలంగా వినిపిస్తూ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, నేడు దేశానికే ఆదర్శంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే శ్వాసగా, ధ్యాసగా జీవించిన జయశంకర్ సార్ పోరాటం, జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.తెలంగాణ ప్రాంత ప్రజల హక్కుల కోసం,మన నీళ్లు - మన నిధులు - మన ఉద్యోగాలు" అనే నినాదంతో ఉద్యమాన్ని బలోపేతం చేసిన ప్రముఖుల్లో జయశంకర్ సార్ ముందువరుసలో నిలిచారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో కలిసి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అకిరెడ్డి. కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీది. క్రిష్ణ గౌడ్, కౌన్సిలర్ దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్ మాయ.మల్లేశం, నాయకులు ఏనుగుల రాజు, ఇస్మాయిల్, సునీల్,బబ్లు, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల హక్కుల సాధనకై జూన్ 25న ఇందిరా పార్క్ వద్ద 'మహా ధర్నా

◆ వాల్ పోస్టర్ విడుదల చేసిన ఉపసర్పంచ్‌లు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21: (జన సంఘర్షణ)




ఈ నెల 25వ తేదిన ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టుతునట్లు రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు కార్తీక్ అన్నారు. మెదక్ జిల్లా ఉప్ప సర్పంచ్ల ఫోరం కమిటీ ఏర్పాటు మెదక్ పట్టణ ములోనీ ప్రవైట్ గార్డెన్‌లో నిర్వహించరు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్‌ల విధులు బాధ్యతలు గురుంచి రాష్ట్ర అధ్యక్షులు కిషోర్ మాట్లాడరు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల హక్కుల రక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25 జూన్ 2026 న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ (ఇందిరా పార్క్) వద్ద భారీ "మహా ధర్నా" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొల్తు కార్తీక్ తెలిపారు.జిల్లా ఉపసర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మంబోజి పల్లి గ్రామానికి చెందిన మహేష్ గౌడ్ రమేష్ గౌడు.జిల్లా అధ్యక్షుడుగా పేరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ అనిల్ కుమార్,ఈ మహా ధర్నా ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ఆత్మ గౌరవమే లక్ష్యం! హక్కుల సాధనే ధ్యేయం!" అనే నినాదంతో ఉప సర్పంచ్ ల ఫోరం - తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయడం కోసం ఫోరం నాయకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ గౌడ్, మహేష్ గౌడ్, జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు నర్సా గౌడ్, కోశాధికా రీ గా ఉమామహేశ్వరి, మరియు జిల్లా కార్యదర్శి రాజు లతో పాటు కార్యవర్గంనూ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ ధర్నా చౌక్ ఇంద్ర పార్క్ ఈనెల జూన్ 25న పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఉప సర్పంచ్‌లకు గతంలో ఉన్న చెక్ పవర్‌ను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలి. అలాగే ఉప సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 5000/- లకు పెంచాలి. వార్డ్ సభ్యుల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 3000/- లకు పెంచుతూ ప్రభుత్వం వెంటనే అధికారిక ప్రకటన చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు అందరూ రాజకీయాలకు అతీతంగా, పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహా ధర్నాను జయప్రదం చేయాలని, తమ న్యాయమైన హక్కులను సాధించుకోవాలని ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు ఉప సర్పంచ్ లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా డాక్టర్ల మల్లిక అశోక్‌ను నియమించినందుకు కృతజ్ఞతలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21 (జన సంఘర్షణ)




నా మీద నమ్మకంతో మెదక్ జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలిగ డాక్టర్ పట్లోళ్ళ మల్లిక అశోక్ నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకి మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు అన్నకి రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డికి, మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్‌కి మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనుకి, పంజా విజయ్ కుమార్ అన్నకి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములుకి మెదక్ జిల్లా నాయకులు, మండల నాయకులు, మహిళ నాయకులకు అందరికీ పేరు పేరున హృదయపూర్వక కృతజ్ఞతలు.

## మొరంకు 24 గంటల పాటు అనుమతులు ఉన్న సాయంత్రం ఐదు గంటల నుంచి నడపకుండా ఉండాలి


◆ ప్రజల ప్రాణాలు దృష్టిలో పెట్టుకొని సాయంత్రం ఐదు గంటల తర్వాత మొరం, మట్టి నడవకుండా చూడాలి

కోటగిరి పోతంగల్ ఉమ్మడి మండలాల/జూన్ 21/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం సోంపురు గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాలనీ సమీపంలో సుమారు 25 ఎకరాల పొలం లో సుమారు 200 కోట్ల నిధులతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణంలో భాగంగా మొరం మట్టి త్రవ్వకాలు 24 గంటల పాటు అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికీ, ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని 24 గంటలు కాకుండా సాయంత్రం ఐదు తర్వాత నడపకుండా ఉండాలని, సాయంత్రం ఐదు తర్వాత రాత్రిపూట మొరం కానీ అదేవిధంగా మట్టి త్రవ్వకాలు రవాణా జరగకుండా చూడాలని, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సోంపూరు పోచిరాం అన్నారు. ఈ సందర్భంగా ఆయనొక ప్రకటనల మాట్లాడుతూ మట్టి త్రవ్వకాలు వాటి రవాణా మొరం త్రవ్వకాలు వాటి రవాణా పగలు రాత్రి అని తేడా లేకుండా జరుగుతున్నాయని, ఇంటిగ్రేట్ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి సింగల్ రోడ్డు కావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గతంలో కూడా ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృత్యువాత పడడమే కాకుండా కొంతమంది ఆసుపత్రి పాలు అయి కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితులు ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు సాయంత్రం ఐదు తర్వాత మట్టి రవాణా మొరం రవాణా జరగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏలాంటి అనుమతులు లేకుండా రాత్రిపూట మట్టి త్రవ్వకాలు రవాణా జరగడం వల్లే ఎమ్మార్పీఎస్ కార్యకర్త చనిపోయారు. ఆయన చనిపోవడం వల్ల ఆయన ముగ్గురు పిల్లలు భార్య అనాధాలు అయ్యారు వారి కుటుంబం రోడ్డున పడింది. ఇంటిగ్రేటెడ్ పాఠశాల నుంచి మట్టి రవాణా హున్స గ్రామానికి ఓ ట్రాక్టర్లో వెళుతుండగా రాత్రిపూట సుమారు 9 గంటల ప్రాంతంలో అతివేగంగా, అధికలోడుతో వెళ్లడం చిన్న రోడ్డు ఉండడం వల్ల, ట్రాక్టర్ ఢీకొని ఎమ్మార్పీఎస్ కార్యకర్త గొంటి నగేష్ మృతి చెందడం జరిగిందని ఆయన అన్నారు. ఆయన చనిపోవడం వల్ల ఆయన భార్య, ముగ్గురు పిల్లలు అనాధలు అయ్యారని వారి కుటుంబం రోడ్డున పడిందని ఇప్పటివరకు స్థానిక ఎమ్మార్వో కానీ అదేవిధంగా ఎవ్వరు కూడా కనీసం కాంట్రాక్టర్ కూడా స్పందించలేదని తన ప్రాణం విలువ కేవలం 70 వేల రూపాయలు ఇచ్చి చేతులు తుడుపుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తే తాము ఒప్పుకోకపోవడం వల్ల కేసులు నమోదు అయినట్టు ఆయన పేర్కొన్నారు. తాము 70 వేల రూపాయలకు ఆశించకుండా కేసుల వరకు వెళ్లడం జరిగిందని ప్రస్తుతం వారిపై కేసులు నమోదు అవ్వడం జరిగిందని అన్నారు. మృతుడు గొంటి నాగేష్ నిరుపేద కుటుంబమని ఆయన కుటుంబానికి పరామర్శించడానికి ఎవరు రాకపోవడం కాంట్రాక్టర్ కూడా స్పందించకపోవడం చాలా దారుణమని ఆయన అన్నారు. అలాగే ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఎన్నో ప్రమాదాలు జరిగి ఆస్పత్రి పాలై ఎంతోమంది నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని దీనిని దృష్టిలో పెట్టుకొని రహదారులు చిన్నవిగా ఉండడం



సింగిల్ రోడ్డు ఉండడం వల్ల ప్రమాదాలు జోరుగా జరుగుతున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మొరం 24 గంటల పాటు నడవకుండా చూడాలని కేవలం సాయంత్రం ఐదు గంటల వరకు నడవాలని ఆయన డిమాండ్ చేశారు రాత్రిపూట మొరం మట్టి త్రవ్వకాలు రవాణా జరగకుండా ఉండాలని తాము అభివృద్ధికి అడ్డు కాదని అన్నారు.

**రాంపూర్ నుంచి మొరం రవాణా**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్ గుట్ట నుంచి మొరం తవ్వకాలు జరుగుతున్నాయి, ఈ మొరం రవాణా ఎక్కడికి జరుగుతున్నాయని ఆరా తీస్తే, ఈ మొరం ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు పోతున్నట్లు సమాచారం అయితే మైనింగ్ శాఖ నుంచి 24 గంటల పాటు అనుమతులు ఉన్నట్టు చూపిస్తున్నారు. ఏది ఏమైనా 24 గంటల పాటు మొరం , మట్టి రవాణా జరగరాదని ఓవైపు ఎమ్మార్పీఎస్ జిల్లా సెక్రెటరీ పోచిరాం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని సాయంత్రం ఐదు గంటల వరకే మొరం, మట్టి రవాణా జరగాలని అనంతరం రాత్రిపూట జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు అయితే ఏం జరుగుతుందో వేచి చూడాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## పాల విక్రయ కేంద్రాల్లో భారీగా దోపిడీ


◆ పాలలో నీళ్లు పోసి భారీగా మోసం..

నిజామాబాద్/జూన్ 21,/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండల కేంద్రం తో పాటు పొతంగల్ మండల కేంద్రంతోపాటు కోటగిరి మండల కేంద్రంతో పాటు వర్ని మండల కేంద్రంతో పాటు చుట్టుపక్క మండల కేంద్రం అదేవిధంగా పలుచోట్ల ఉన్న పాలయ విక్రయ కేంద్రాల నిర్వహకులు పాలు కొనుగోలు చేసే ప్రజలకు భారీగా మోసం చేస్తున్నారని ప్రజలు వారితీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాడి రైతుల నుంచి పాలు సుమారు 50 నుంచి 60 రూపాయలకు ఒక్క లీటరుకు కొనుగోలు చేసి పాల విక్రయ కేంద్రం వారు ఎక్కడబడితే అక్కడ పుట్టగొడుగుల వెలిసి, షాపులు ఏర్పాటు చేసి, పాలు కొనుగోలు చేసి, పాలల్లో భారీగా నీళ్లు పోస్తూ, కొంతమంది అయితే పాలు చిక్కగా ఉండడం కోసం కల్తీ పౌడర్లు కలపడంతోపాటు ఇతర రసాయన పదార్థాలు కలుపుతూ పాలు అవసరం ఉన్న ప్రజలకు విక్రయాలు చేస్తూ ప్రజలకు జేబులు కొల్ల చేయడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగట్ట మాడుతున్నారని విమర్శలు చేస్తున్నారు. పాల విక్రయ కేంద్రాలలో డైరెక్ట్ గా పాడి రైతు నుంచి పాలు కొనుగోలు చేసి నీళ్లు పోయని చిక్కటి పాలు అమ్ముతున్నారని నమ్మకంతో ప్రజలు తండోపా తండాలుగా పాలవిక్రయ కేంద్రాలకు వెళ్లి పాలు కొనుగోలు చేసిన వారికి భారీగా మోసం జరుగుతుందని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. అనేక ఏళ్ల నుంచి పాలవిక్రయ కేంద్రాల నిర్వాహకులు భారీగా మోసం చేస్తున్నప్పటికీ వీటిపై సంబంధిత శాఖ అధికారులు నిగా పెట్టకుండా వారి వద్ద మామూలు తీసుకుంటూ నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం పడుతున్నారు.


**పాడి రైతులకు భారీగా మోసం వేస్తున్న పాలవిక్రయ కేంద్రాల నిర్వహకులు**

పాడిపై ఆధారపడ్డ రైతులు పాల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబం పోషించుకుంటున్న పాడి రైతులు మాత్రం పాల విక్రయ కేంద్రాల నిర్వాహకుల నుంచి భారీగా మోసపోతున్నారని విమర్శ వినిపిస్తుంది, పాడి రైతుల నుంచి పాల విక్రయ కేంద్ర నిర్వాహకులు సుమారు 50 రూపాయల నుంచి 60 రూపాయలకు ఒక లీటర్ చొప్పున కొనుగోలు చేసి వెన్న శాతం లేదని ఏదో ఒక కుంటి సాకుతో తక్కువ ధర ఇవ్వడమే జరుగుతుందని అంతేకాకుండా ప్యాటు రానిపక్షంలో ఇంకా తక్కువ ధర ఇస్తూ పాడి రైతులకు తీవ్రంగా మోసం చేస్తూ అదే పాలను పాలు అవసరం ఉన్నవారికి సుమారు 80 రూపాయల నుంచి సుమారు 100 రూపాయల వరకు విక్రయాలు చేస్తున్నారని భారీగా ప్రజలకు మోసం చేస్తున్నారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. వెన్న శాతం ద్వారా ఫ్యాట్ వస్తేనే డబ్బులు బాగా వస్తాయి ఫ్యాట్ రాణి పక్షంలో తక్కువ డబ్బులు వస్తాయి, ఇందులో కూడా పాడి రైతులు మోసపోవడం జరుగుతుందని, కానీ పాలు విక్రయాలు చేసే ప్రజలకు మాత్రం వెన్న శాతంతో పని లేకుండా భారీగా నీళ్ళు కలుపుతూ చిక్కటి పాలు అంటూ ప్రజలకు మోసం చేస్తూ అధిక ధనులకు విక్రయిస్తూ ప్రజలకు మోసం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల 80 రూపాయలు కాకుండా 90 రూపాయలు అదే విధంగా 100 రూపాయలకు లీటరు పాలు అమ్మకాలు చేస్తూ ప్రజలకు మోసం చేస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో 100 రూపాయలకు లీటర్ దొరుకుతుంది అంటే పాలకు ఎంత డిమాండ్ ఉందో పలువురు చర్చలు చేసుకుంటున్నారు. అదేవిధంగా పాల విక్రయ కేంద్రాల నిర్వహకులు భారీగా మోసం చేస్తూ ప్రజల జేబులను కొల్లగొట్టడమే కాకుండా, పొతంగల్ మండల కేంద్రంలో పాల నిర్వాహకులు భారీగా ప్రజలకు మోసం చేస్తున్నారని కోటగిరి తో పాటు రుద్రూర్ మండల కేంద్రం ఇతర మండలాలు కూడా పాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు భారీగా మోసం చేస్తున్నారని పలువురు ఆరోపణ చేసినారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు నిగా పెట్టి మోసం అరికట్టి ప్రజలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## బదిలీపై వెళ్తున్న దోమలేడిగి కార్యదర్శికి ఘన సన్మానం

కోటగిరి /జూన్ 21/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా. పోతంగల్ మండలంలోని దోమలేడిగి గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ దేవిక శ్రీధర్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న కార్యదర్శి నాగార్జున్ గౌడ్ కు గ్రామ సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు కార్యదర్శి నాగరాజుగౌడ్ ఆయన సతీమణికి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా సరే విధి నిర్వహణలో బదిలీలు సహజ మని అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఆయన సాయ సహకారాలు అందిస్తూ గ్రామానికి అభివృద్ధి పథంలో నడుపుటకు ఆయన వంతు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేసి గ్రామపంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చే వ్యక్తి అని అన్నారు. గ్రామంలోని పరిశుభ్రత పాటిస్తూ, మురికి కాలువలు మంచినీటి సరఫరా చేయటములో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనిచేసే వారని గుర్తు చేశారు. కరణ కాలంలో ఆయన విధి నిర్వహణలో ఆయన సేవలను గుర్తించారు. బదిలీపై బోధన్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి వెళుతున్న శుభ సందర్భంగా కార్యదర్శికి గ్రామపంచాయతీ సర్పంచ్ పాలకవర్గంతో పాటు గ్రామ యువకులు గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దేవిక, శ్రీధర్, ఉప సర్పంచ్ భీంరావు, పాలకవర్గ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ అంజనేయులు, గ్రామ నాయకులు దిగంబర్ పటేల్, ఫీల్డ్ అంగన్వాడి టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు ..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
సోమవారం
22 జూన్ 2026

# తెలంగాణ రైతులకు దారుణంగా వెన్నుపోటు పొడిచింది ఈ కాంగ్రెస్ సర్కారు

- అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో అన్నదాతలను అనాథగా మార్చే దుర్మార్గానికి తెగబడింది.
- కేంద్రం చెప్పిన కోటా వరకు మాత్రమే పంటలు కొంటాం తప్ప రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి అదనంగా ఒక్క గింజ కొనే ప్రసక్తే లేదని చెప్పడం రైతులకు మరణశాసనమే.
- వ్యవసాయాన్ని ఇప్పటికే సంక్షోభంలోకి నెట్టి రైతు బతుకును ఛిద్రంచేశారు సీఎం రేవంత్.
- పదేళ్లపాటు ధీమాగా, ధైర్యంగా బతికిన రైతును మళ్లీ సమైక్యరాష్ట్రం నాటి కష్టాల్లోకి నెట్టారు.
- చరిత్ర చూస్తే.. సమైక్యరాష్ట్రంలో అరవైఏళ్లపాటు తెలంగాణ రైతులు అరిగోస పడ్డారు.
- పక్కనే గోదారి, కృష్ణా పారుతున్నా, సాగునీటి వసతి లేదు. కరెంట్ కు దిక్కులేదు.
- కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్ ఫార్మర్లతో తల్లడిల్లని రోజు లేదు.

పొతంగల్/జూన్ 21/(జన సంఘర్షణ)

60 ఏళ్ల తెలంగాణలో వ్యవసాయం కన్నీటి సేద్యంగానే సాగింది. దేశంలోనే అత్యధిక రైతుల ఆత్మహత్యలతో తల్లడిల్లిన నేల తెలంగాణ కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమానికి మనాది కూడా రైతుల అందుకే నీళ్లు నిధులు నియామకాలు అనే ఉద్యమ నినాదాన్ని ఓసిఆర్ తొలి ప్రభుత్వ విధానంగా మార్చారు. రైతే కేంద్రంగా, రైతుకు రక్షణ వలయంగా అనేక ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు చేపట్టారు. మిషన్ కాకతీయ ద్వారా 45 వేల చెరువుల పూడిక తీసి భూగర్భజలాలను పెంచారు. కాళేశ్వరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల సాగునీటి కష్టాలకు పరిష్కారం చూపారు. దేశ చరిత్రలో ఏ పాలకుడు ఆలోచించని విధంగా రైతు బంధు పేరిట



పెట్టుబడి సాయాన్ని ప్రవేశపెట్టారు. రైతుల ఖాతాలో నేరుగా 11 విడతల్లో 72 వేల కోట్లు జమచేసి దేశంలోనే చరిత్ర సృష్టించారు. రైతు కుటుంబానికి ఏమైనా జరిగితే రోడ్డున పడకూడదని ఐదు లక్షల రైతుబీమాను అమలుచేశారు. రైతుబంధుకు 72 వేల కోట్లే కాకుండా, రైతు రుణమాఫీకి 29 వేల కోట్లు, రైతు బీమాకు. 6800 . కోట్లు, రైతుల ఖాతాలో నేరుగా లక్ష కోటకు పైగా స్వతంత్ర భారతావనిలో తొలిసారి రైతులకు 24 గంటల చరిత్ర సృష్టించారు. రైతు కేంద‌బిందువుగా సాగిన పాలన వల్ల తెలంగాణలో వ్యవసాయ విప్లవం వచ్చింది. నెర్రెలు బారిన నేలలు పచ్చని మాగాణాల్లా మారాయి. 2014కు ముందు వానాకాలం, యాసంగి రెండు పంటల విస్తీర్ణం కోటి 31 లక్షల ఎకరాలు. అది 2023 నాటికి 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు చేరింది. అన్నిరకాల పంటల ఉత్పత్తులతో తెలంగాణ దేశానికే ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారింది. కరోనా కష్టకాలంలో 7 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతు కల్లాల వద్దే ప్రతిపంటను చివరి గింజ వరకూ కొని రైతుకు కొండంత అండగా నిలిచారు కేసీఆర్. మద్దతు ధరకు కేవలం వరిధాన్యమే కాకుండా, మొక్కజొన్న, జొన్న, శనగ, కందులు, పెసలు, సన్ ఫ్లవర్, సోయాబీనా కూడా కొనుగోలు చేసింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం. పంజాబ్ నే తలదన్ని దేశంలోనే అత్యధిక ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగా ఎదిగింది. ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు, సుద్దాం నవీన్, ఉమ్మడి మండలాల సీనియర్ నాయకుడు పెద్దలు డాక్టర్, ఎంపి అకీమ్,సామాజిక సేవాకర్త, జలల్, సాయి కిరణ్, ఏకార్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట సీహెచ్‌సీ అభివృద్ధికి తక్షణ చర్యలు

- ఆసుపత్రిలో సింధు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
- ఆసుపత్రిలో సమస్యలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు.





ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21: (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సిహెచ్‌సీ) మెదక్ లోక్‌సభ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు.ఆసుపత్రిలో డాక్టర్ మాధవనేని సింధు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని పలు సమస్యల గురించి వైద్య సిబ్బందిని, రోగులను అడిగి తెలుసుకుని, ఆ వివరాలను తన రికార్డులలో నోట్ చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామాయంపేట ఆసుపత్రిలో ఐదేళ్లుగా డెంటల్ డాక్టర్ ఉన్నప్పటికీ ట్రీట్మెంట్ చేయడానికి డెంటల్ చైర్ లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. దీనిపై తక్షణమే స్పందించి,సుమారు రెండున్నర లక్షల రూపాయల విలువైన అధునాతన డెంటల్ చైర్‌తో పాటు దానికి కావలసిన కన్సర్న్ ఎక్విప్మెంట్స్ అన్నింటినీ మంజూరు చేస్తూ ఐదు రోజుల్లో డెలివరీ అయ్యేలా ఆర్డర్ ప్లేస్ చేసినట్లు ప్రకటించారు. అదేవిధంగా ఎక్స్-రే ప్రింటింగ్ సమస్యను తీర్చడానికి ఒక సీఆర్ మెషిన్‌ను కూడా వెంటనే హాస్పిటల్‌కు డెలివరీ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.?రోజూ సుమారు 200 మందికి పైగా వచ్చే ఓపి రోగుల దాహార్తిని తీర్చడానికి ఆసుపత్రిలో త్రాగునీటి వసతి కోసం ఒక ఆరో ప్లాంట్‌ను తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో డయాలసిస్ సెంటర్లు ప్రారంభమైనప్పటికీ, రామాయంపేట,తూప్రాన్ లలో ప్రారంభం కాలేదని గుర్తు చేస్తూ, ఉన్నతాధికారులతో మాట్లాడి రాబోయే రెండు నెలల్లో (విథిన్ టు మంత్స్) రామాయంపేట సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.అలాగే గత ఐదేళ్లుగా ఇక్కడ గైనకాలజిస్ట్ లేకపోవడం వల్ల గర్భిణీలు డెలివరీల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు లేదా సిద్దిపేట, మెదక్, కామారెడ్డి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ ఒక మహిళా గైనకాలజిస్ట్‌ను నియమించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, వీలుకాకుంటే డిప్యుటేషన్ మీదనైనా మహిళా డాక్టర్‌ను ఇక్కడికి రప్పిస్తానని భరోసా ఇచ్చారు. హాస్పిటల్‌కు ఎన్ఆర్ఈజీఎస్ కింద ఒక కిచెన్ షెడ్, హైవే పక్కన ఉన్నందున ఒక ట్రామా సెంటర్ ఏర్పాటుకు కూడా కృషి చేస్తామన్నారు. ఒక నెల తర్వాత మళ్లీ తాను ఆసుపత్రిని సందర్శించి, ఇప్పుడు ఇచ్చిన హామీల అమలు తీరును స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు. ఓటర్ల సవరణ పై ప్రతి ఒక్కరూ సహకరించాలి ఇదే వేదికగా దేశంలో జరగబోతున్న 11వ సారి ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియపై ఎంపీ రఘునందన్ రావు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ నెల 25వ తారీకు నుండి ప్రారంభం కాబోతున్న ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బి ఎల్ ఓ) ప్రతి ఇంటికి వస్తారని, ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫామ్ నింపాలని సూచించారు. ఫామ్ నింపకపోతే ఓటర్ లిస్ట్ నుండి పేరు తొలగించబడుతుందని, లీడర్లు, రిపోర్టర్లు అధికారులు ఉన్నత అధికారులు సైతం మినహాయింపు కాదని హెచ్చరించారు. బీఎల్‌వోలు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని, ఈ ప్రక్రియకు భారతీయ జనతా పార్టీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఓట్లనుతొలగిస్తారంటూ చేస్తున్న మోసపూరిత, దుర్మార్గపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నికల సంఘం ప్రతి పదేళ్లకు ఒకసారి చేసే ఈ ప్రక్రియకు, కరోనా తదితర కారణాల వల్ల 24 సంవత్సరాల గ్యాప్ వచ్చిందని తెలిపారు. ఓటర్లు రెండు చోట్ల ఫామ్స్ ఇవ్వకుండా, తాము ప్రస్తుతం నివసిస్తున్న ఒకే చోట ఎన్యుమరేషన్ ఫామ్ నింపి భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకరించాలని తెలంగాణ ఓటర్ మహాశయులకు ఎంపీ సవినయంగా అప్పీల్ చేశారు. ఈ సమావేశానికి రామాయంపేట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ లింబాద్రి, దుబ్బాక ఆసుపత్రి సూపర్డెంట్ హేమరాజ్ సింగ్, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎం.ఎల్.ఎన్.రెడ్డి, రామాయంపేట పట్టణ మండల అధ్యక్షులు అవినాష్ రెడ్డి, నవీన్ గౌడ్, ఆయా గ్రామాల బిజెపి సర్పంచులు అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, లక్ష్మాపూర్ సర్పంచ్ నవీన్ గౌడ్, దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు, రామాయంపేట బిజెపి కౌన్సిలర్ శంకర్ గౌడ్, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం కుటుంబంలో ఘోర విషాదం

- కారు చెట్టును ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

భద్రాచలం జూన్ 21 (జన సంఘర్షణ)





భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపుతూ ఒక ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ములకలపల్లి మండలం పరిధిలోని పూసుగూడెం, మాదారం అటవీ ప్రాంత మార్గంలో ప్రయాణిస్తున్న ఒక కారు అదుపు తప్పి వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న పెద్ద చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘోర ప్రమాదంలో భద్రాచలం వెంకటేశ్వర కాలనీకి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను సాయి, సంధ్య, మోక్షిత్‌లుగా పోలీసులు గుర్తించారు. ఒకే కుటుంబంలో ముగ్గురు కళ్లముందే మృతి చెందడంతో వెంకటేశ్వర కాలనీలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. కారులో ప్రయాణిస్తున్న మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన స్థానికులు, పోలీసులు స్పందించి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని తక్షణ చికిత్స నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అతనికి అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు ములకలపల్లి గ్రామంలోని తమ బంధువుల ఇంటికి శుభకార్యం లేదా పరామర్శ నిమిత్తం వెళ్లి, తిరిగి భద్రాచలం వస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ములకలపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

# యూరియా యాప్‌ను తొలగించాలి బిఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్

కోటగిరి /జూన్ 22 /( జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో గంగ ప్రసాద్ గౌడ్ ఇంటి ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాక అధ్యక్షులు కేటీఆర్ ఆదేశాల మేరకు పత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ రైతులు యాపుల ద్వారా ఆన్లైన్ వేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు చదువురాని రైతులు స్మార్ట్ ఫోన్లు లేక ఇబ్బంది పడుతున్నారు ఏ పరిధిలో యూరియా నిలువలు ఉన్నాయో తెలియక శతమాతమవుతున్నరని ఎద్దేవా చేశారు 10 సంవత్సరంలో కెసిఆర్ ప్రభుత్వంలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పంటలు అధికంగా పండించి రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు కరోనా కాలంలో కూడా రైతులు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అయినా రాష్ట్ర ప్రజలు కరువు కష్టకాలంలో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు యూరియా యాప్ తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు బిజెపి పార్టీకి కేంద్రంలో ప్రతిపక్షంగా ఉండాలి తప్ప వారికి మద్దతుగా ఉండకూడదని అన్నారు తెలంగాణ రైతాంగానికి మద్దతుగా ఉండి యూరియా యాప్ ను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెల్ల రవికుమార్ మోరే కిషన్ బో ట్టగజేందర్ గంగ ప్రసాద్ గౌడ్ శంకర్ గౌడ్ నజీర్ సమీర్ పాల గంగారం కన్నం సాయిలు కప్ప సంతోష్ సందీప్ అస్కుల గంగారం తదితరులు పాల్గొన్నారు.

# డోంగ్లీమండల అధ్యక్షులు గజ్జు దేశాయ్, డీసీసీ ఉప అధ్యక్షులు డోంగ్లీ మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన ఘన సన్మానం



డోంగ్లీ/జూన్ 21/(జన సంఘర్షణ)

ఈ రోజు డోంగ్లీ మండలంలో మండల అధ్యక్షులు గజ్జు దేశాయ్, డీసీసీ ఉప అధ్యక్షులు డోంగ్లీ మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం చెయ్యడం జరిగింది. మా మద్నూర్ మండల ముద్దు బిడ్డ షేక్ అజీమ్ కామారెడ్డి జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా డోంగ్లీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పదవి మా ఉమ్మడి మండలానికి రావడం ఎంతో గర్వకారణం అని తెలియ చేశారు. ఈ సందర్భంగా డోంగ్లీ మండల సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీ పాల్గోనడం జరిగింది. మండల అధ్యక్షులు గజ్జు దేశాయ్ మాట్లాడుతూ.. గౌరవ ఎంఎల్ఏ లక్ష్మీకాంతరావుకి, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్‌కి, రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లా చెస్ టోర్నీలో సాయి సామల అకాడమీ సత్తా: ముగ్గురికి రాష్ట్ర స్థాయికి అర్హత



నిజామాబాద్/జూన్ 21/(జన సంఘర్షణ)

బోధన్ పట్టణంలోని సాయి సామల చెస్ అకాడమీ విద్యార్థులు జిల్లా అండర్-11 చెస్ సెలెక్షన్ టోర్నమెంట్లో అద్భుత ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. నిజామాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జిల్లా స్థాయి అండర్-11 బాలురు, బాలికల చెస్ సెలెక్షన్ టోర్నమెంట్లో అకాడమీ విద్యార్థులు పలు బహుమతులు అందుకున్నారు. విజేతల్లో బాలికల విభాగంలో ఎం. నిత్య శ్రీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని బంగారు పతకాన్ని సాధించగా, ఎస్. సాయి సహారా ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుచుకుంది. బాలుర విభాగంలో ఎం. హితేంద్ర తృతీయ స్థానాన్ని సాధించాడు. ఈ ముగ్గురు విద్యార్థులు ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర అండర్-11 చెస్ ఛాంపియన్ షిప్ - 2026లో పాల్గొననున్నారు.

# జైలు గోడల మధ్య యోగామృతం

- ఖైదీల్లో నూతన ఉత్తేజం నింపిన 15 రోజుల శిక్షణ
- మహబూబాబాద్ సబ్ జైల్లో యోగా దినోత్సవం: ముఖ్య అతిథిగా పాల్గొన్న సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు
- ఖైదీల మానసిక పరివర్తనకు యోగా ఎంతో అవసరం: సిటిజన్ ఫోరం ప్రతినిధి శంతన్ రామరాజు
- సబ్ జైల్లో ముగిసిన 15 రోజుల యోగా శిక్షణ: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శంతన్ రామరాజు
- భారతదేశం ప్రపంచానికిచ్చిన గొప్ప ఆరోగ్య వరం యోగా: జైలర్ మల్లెల శ్రీనివాసరావు





మహబూబాబాద్ జూన్ 21 (జన సంఘర్షణ)

మానవ మేధస్సుకు, శారీరక దృఢత్వానికి యోగా ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిక జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని మహబూబాబాద్ సబ్ జైలు జైలర్ మల్లెల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ సబ్ జైలు ఆవరణలో ఆదివారం నాడు ప్రత్యేక కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జైలు సిబ్బంది, ఖైదీలు మరియు పలువురు ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గత పక్షం రోజులుగా సబ్ జైలులోని ఖైదీల శారీరక, మానసిక ఉల్లాసం కొరకు ప్రత్యేకంగా యోగా శిక్షణా తరగతులను నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటితో ఈ శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకల సందర్భంగా జైలర్ మల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచ దేశాలకు అందించిన అత్యంత గొప్ప, అమూల్యమైన ఆరోగ్య వరం యోగా అని కొనియాడారు. నిత్యం యోగాభ్యాసం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, శరీర దారుఢ్యంతో పాటు రోగనిరోధక శక్తి అద్భుతంగా మెరుగుపడుతుందని జైలర్ శ్రీనివాసరావు వివరించారు. తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించవచ్చని ఆయన ఆకాంక్షించారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రముఖ సామాజిక కార్యకర్త, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జైలు వాతావరణంలో ఖైదీల మానసిక పరివర్తన కోసం ఇటువంటి యోగా తరగతులు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో శంతన్ రామరాజు మాట్లాడుతూ, ఖైదీలు తమ గత జీవితాన్ని మరిచి, సన్మార్గులుగా మారడానికి యోగా ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం సిటిజన్ ఫోరం ఎల్లప్పుడూ ముందుంటుందని, ఇలాంటి సంస్కరణ కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన చాటిచెప్పారు. ఖైదీల్లో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు జైలు శాఖ తీసుకుంటున్న చొరవను శంతన్ రామరాజు ప్రత్యేకంగా ప్రశంసించారు. యోగా ద్వారా లభించే క్రమశిక్షణ, నిగ్రహం ఖైదీల భవిష్యత్తు జీవితానికి ఒక మంచి మార్గాన్ని చూపిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సబ్ జైలు ఖైదీలకు గత 15 రోజులుగా ఎంతో ఓపికతో, నిష్ణాతుడైన గురువుగా యోగాసనాలను నేర్పించిన యోగా గురువు ఉమ్మగాని అరుణ్ కుమార్ సేవలను ఈ సందర్భంగా అధికారులు, సిటిజన్ ఫోరం ప్రతినిధులు ఘనంగా కొనియాడారు. అనంతరం యోగా గురువు ఉమ్మగాని అరుణ్ కుమార్‌కు జైలు డిపార్ట్‌మెంట్ తరపున అధికారుల చేతుల మీదుగా జ్ఞాపిక (మెమెంటో), శాలువాతో ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఖైదీలు కూడా తమ స్పందనను తెలియజేస్తూ, యోగా వల్ల తమలో మానసిక ఒత్తిడి తగ్గిందని, ఇక్కడే కాకుండా విడుదలైన తర్వాత కూడా తమ దైనందిక జీవితంలో యోగాను కొనసాగిస్తామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ముగింపు వేడుకల కార్యక్రమంలో సిటిజన్ ఫోరం ప్రతినిధి శంతన్ రామరాజుతో పాటు, సబ్ జైలు సిబ్బంది, యోగా సాధకులు, పెద్ద సంఖ్యలో ఖైదీలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# అభివృద్ధిపై ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందాం.. ఎమ్మెల్యే కనకయ్య

- బీఆర్ఎస్ నేతలకు ఎమ్మెల్యే కనకయ్య సవాల్
- ఎమ్మెల్యే కనకయ్య సవాల్‌కు కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్ పూర్తి మద్దతు.. విపక్షాలపై ఫైర్

ఇల్లందు జూన్ 21 (జన సంఘర్షణ)

ఇల్లందు నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేశారో ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బీఆర్ఎస్ నాయకులకు బహిరంగ సవాల్ విసిరారు. ఆదివారం ఇల్లందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను డబ్బులు తీసుకుని పార్టీలు మారానంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, తక్కళ్లపల్లి రవీందర్ రావు చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆనాడు కేసీఆర్, హరీష్ రావు స్వయంగా పిలిపించుకుని ఇల్లందు అభివృద్ధికి రూ. 200 కోట్లు ఇస్తామని, రోళ్లపాడు వద్ద రూ. 7 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మించి ఏజెన్సీని సస్యశ్యామలం చేస్తామని మాట ఇవ్వడం వల్లే తాను నాడు పార్టీ మారానని కనకయ్య స్పష్టం చేశారు. తానేమీ వారిలా నామినేటెడ్ పదవులు తెచ్చుకోలేదని, ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేగా రెండుసార్లు, జెడ్పీ చైర్మన్‌గా ఒకసారి ప్రజాసేవ చేశానని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో జెడ్పీ చైర్మన్ పదవిని కేవలం కుర్చీకే పరిమితం చేసి, ఒక్క రూపాయి బడ్జెట్ కూడా ఇవ్వకుండా కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు గానూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెల రూ. 7 వేల కోట్ల వడ్డీలు చెల్లిస్తూనే.. ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, రూ. 500లకే గ్యాస్ వంటి సంక్షేమ పథకాలను ఎన్ని ఇబ్బందులు ఉన్నా అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా ఇల్లందులో కాంగ్రెస్ పార్టీదే గెలుపని, బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కీలక విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్ చురుకైన పాత్ర పోషించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యకు అండగా నిలుస్తూ, నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కౌన్సిలర్ శివ కిరణ్ ముందంజలో ఉన్నారు. విపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టేలా వార్డు స్థాయి నుండి పార్టీ శ్రేణులను బలోపేతం చేయడంలో ఆయన కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఎమ్మెల్యే



కనకయ్య సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అనసూయ, మాజీ వైస్ చైర్మన్ పులిగండ్ల మాధవరావు, కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు మండల రాము, బోళ్ల సూర్యం, మహిళా అధ్యక్షురాలు స్వరూప, కోఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, హసీనాతో పాటు పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# న్యూ లక్ష్మీపురం కేజీబీవీలో ఘనంగా యోగా దినోత్సవం

- యోగా భారతావని ప్రపంచానికిచ్చిన అద్భుత సంజీవని కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు మొరం వెంకటేష్
- వైద్య ఆరోగ్యశాఖ, ఆయుష్ ఆధ్వర్యంలో కేజీబీవీలో యోగా వేడుకలు.. ప్రాముఖ్యతను వివరించిన ఇన్‌స్ట్రక్టర్ వెంకటేష్
- విద్యార్థి దశ నుంచే యోగా అలవాటు చేసుకోవాలి: కేజీబీవీ ఎస్ఓ ఇందిరా, ఇన్‌స్ట్రక్టర్ వెంకటేష్ పిలుపు

న్యూ లక్ష్మీపురం జూన్ 21 (జన సంఘర్షణ)

న్యూ లక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని విద్యార్థినులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. వైద్య ఆరోగ్య శాఖ మరియు ఆయుష్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన యోగా ఇన్‌స్ట్రక్టర్ వెంకటేష్ విద్యార్థినులకు పలు రకాల ఆసనాలను స్వయంగా నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యోగాను అలవాటు చేసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మానసిక ఏకాగ్రత లభిస్తుందని తెలిపారు. నిత్య జీవితంలో యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అనంతరం కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు మొరం వెంకటేష్ మాట్లాడుతూ.. యోగా యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు చక్కగా వివరించారు. భారతదేశం ప్రపంచ దేశాలకు అందించిన అత్యంత విలువైన శాస్త్రీయ సంపద యోగా అని ఆయన కొనియాడారు. కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా.. ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను పెంచే ఒక అద్భుత జీవన విధానం యోగా అని మొరం వెంకటేష్ స్పష్టం చేశారు. నిరంతరం మానసిక ఒత్తిడి, శారీరక అలసటతో సతమతమయ్యే ప్రస్తుత ఆధునిక కాలంలో యోగా ఒక సంజీవనిలా పనిచేస్తుందని మొరం వెంకటేష్ పేర్కొన్నారు. నిత్యం యోగాసనాలు, ప్రాణాయామం చేయడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి అద్భుతంగా పెరుగుతుందని, తద్వారా ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని ఆయన విద్యార్థినులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) ఇందిరా మాట్లాడుతూ.. తమ విద్యాలయంలో ఇటువంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినులు తమ దినచర్యలో ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. యోగా సాధన చేసిన విద్యార్థినులను, ఇన్‌స్ట్రక్టర్ వెంకటేష్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ అద్భుత వేడుకల్లో వైద్య ఆరోగ్య శాఖ, ఆయుష్ విభాగ సిబ్బందితో పాటు కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో







విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈరోజు ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయల పల్లి గ్రామంలో గంగమ్మ తల్లి బోనాలు పోతురాజు వేషంలో జాల సాంబ ఈ ప్రోగ్రాం లో పాల్గొన్న యాదవ సంఘం ముఖ్య నాయకులు, మహిళలు, గ్రామస్తులు బోనాలతో అమ్మవారికి పాడిపంటలు పండి సుఖ సంతోషాలతో రైతులందరూ తెలంగాణ రాష్ట్రం , భారతదేశం సుఖంగా సుభిక్షంగా దేశంలోనే నెంబర్ వన్ తెలంగాణ రాష్ట్రం



కావాలని కోరుకుంటూ జై యాదవ్ జై మాధవ్ జై ఉసిరికాయలపల్లి.

# ప్రశాంతంగా జిల్లాలో నీట్ పరీక్షలు నిర్వహణ

- జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్.
- పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్.
- 481 అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 423 పరీక్షలకు హాజరు.
- 58 అభ్యర్థులు వివిధ కారణాలతో గైర్హాజరు.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ .

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కలెక్టర్ ప్రతిమాసింగ్ వెల్లడించారు. జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ ఆదివారం మెదక్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించగా పరీక్షా కేంద్రాన్ని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ , సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్ట ప్రణాళిక ద్వారా సమావేశాలు నిర్వహించుకుని వివిధ శాఖల అధికారులకు సూచనలు సలహాలు అందించడం జరిగిందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా వసతులు కల్పించినట్లు వెల్లడించారు. పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు అభ్యర్థులను ప్రవేశ ద్వారం వద్ద తనిఖీలు నిర్వహించి లోపలికి అనుమతించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ యంత్రాంగం 163 బి.ఎన్.ఎస్ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి పటిష్ట భద్రత నడుమ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. 481 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 421 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్లు వివరించారు. వివిధ కారణాల వల్ల 58 మంది గైర్హాజర్ కావడం జరిగిందని అన్నారు. నీట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు చెప్పారు.

# చెత్తను రోడ్డుపై న తగుల పెట్టిన వారికి మూడు వేల జరిమాణం విధించిన మున్సిపల్ సిబ్బంది

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21: (జన సంఘర్షణ)





పట్టణంలో పారిశుధ్య నిర్వహణ గురించి తరచూ చేపడుతున్న పర్యవేక్షణలో వార్డు నెంబర్ 12లో గల స్క్రాప్ షాప్ వారు రోడ్డుపైన చెత్తను వేసి తగలబెట్టినారని గమనించి వెంటనే వారిని హెచ్చరించి రూ. 3000/- జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా, మెదక్ పట్టణ ప్రజలకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలియజేయునది ఏమనగా ఎవరైనా చెత్తను రోడ్ల పైన గాని, ఖాళీ స్థలాల్లో గాని వేసి తగలబెట్టినట్టు మా పర్యవేక్షణలో తెలిసినా కానీ మా దృష్టికి వచ్చిన గాని అట్టి వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా జరిమానా విధించబడును. కావున మెదక్ పట్టణ ప్రజలు పర్యావరణాన్ని పరిరక్షించుటలో మీ వంతు బాధ్యత వహించాలని కోరడమైనది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
సోమవారం
22 జూన్ 2026

## తనకోసం ఎవ్వరూ.. రాజీనామా చెయ్యరు

**● ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్**



హైదరాబాద్/జూన్ 21/(జన సంఘర్షణ)
తనకు రాజ్యసభ పంపడానికి తెలంగాణ ఎంపీ లెవ్వరూ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని అసలు అలాంటి ప్రతిపాదనలేవీ లేవని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. ఆదివారం నాంపల్లిలోని గాంధీ భవన్లో ఆమె మాట్లాడుతూ.. తాను మధ్యప్రదేశకు చెందిన వ్యక్తిని తెలిపారు. తెలంగాణ నుంచి రాజీనామా చేయించినా తాను ఆ రాజ్యసభ స్థానాన్ని తాను తీసుకోనన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ న్యాయవాది, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ లాంటి వ్యక్తుల కోసం వేరే రాష్ట్రాలు సీట్లు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు తన లాంటి వారి కోసం తెలంగాణ రాజ్యసభ స్థానాన్ని ఇస్తే.. అందుకు తాను ఒప్పుకోనని పేర్కొన్నారు. బీజేపీ, ఎన్నికల సంఘం పూర్తిగా లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నాయనీ. అందువల్లే తన నామినేషన్ తిరస్కరించారని మీనాక్షి అన్నారు. కేవలం ఇది ఒక్క సీటుకు సంబంధించిన విషయం కాదని తెలిపారు. ఒకే దేశం ఒకే ఎన్నిక చేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. తన నామినేషన్ విషయంలో బీజేపీ చేస్తున్న ఆరోపణలు అబద్ధమని చెప్పారు. గణపతి పాలు తాగుతున్నాడని బీజేపీ అబద్ధాలను సృష్టించిందని సోదాహరణగా వివరించారు. ఇప్పుడు సోషల్ మీడియా యుగం అని.. అన్ని విషయాలు బయటకు వస్తాయని మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

**బయట పడిన బీజేపీ బండారం......**

పార్టీని ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ అనేక అబద్ధాలను సృష్టించిందని అన్నారు. రాజ్యసభ నామినేషన్ రిజక్ట్ చేసినందుకు తనకేం బాధ లేదన్నారు. తన నామినేషన్ తిరస్కరించడం వల్ల బీజేపీ బండారం బయట పడిందని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని తెలిపారు. బీజేపీ నేతలను నామినేషన్ రూంలోని ఎలా అనుమతించారంటూ ఈ సందర్భంగా సందేహం వ్యక్తం చేశారు..


## రామాయంపేట అభివృద్ధికి ఎంపీ రఘునందన్ రావు కట్టుబాటు

**● రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు అన్నారు.**



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21: (జన సంఘర్షణ)
మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదివారం మెదక్ జిల్లా రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాయంపేట భారతీయ జనతా పార్టీ వినతి మేరకు రామాయంపేట ఆసుపత్రికి గైనకాలజిస్ట్ పోస్టు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే డెంటల్ పోస్టు ఉన్నప్పటికీ డెంటల్ కుర్చీ లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సుమారు రూ.2.5 లక్షల వ్యయంతో డెంటల్ కుర్చీ మంజూరు చేయడం జరిగింది. అదేవిధంగా రామాయంపేటకు ట్రామా సెంటర్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రామాయంపేట అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, అన్ని రంగాల్లో రామాయంపేటను ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. రామాయంపేట ప్రజలతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, ప్రజల అభిమానం ఎప్పటికీ మర్చిపోలేనని ఎంపీ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎన్ఆర్జీఎస్ నిధులతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రామాయంపేట అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎంపీ రఘునందన్ రావుకి రామాయంపేట ప్రజల పక్షాన, భారతీయ జనతా పార్టీ రామాయంపేట శాఖ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.


## బోధన్: నీట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ డీసీపీ





బోధన్/ జూన్ 21/(జన సంఘర్షణ)
నీట్ పరీక్షల నేపథ్యంలో బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆదివారం అడిషనల్ డీసీపీ శుభం ప్రకాశ్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు, భద్రతా చర్యలను ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ నికత్ కౌసర్ పాల్గొన్నారు.

## 3 తులాల బంగారం, 40 వెండి ఆభరణాలు చోరీ



ఎడపల్లి/జూన్ 21/(జన సంఘర్షణ)
ఎడపల్లి మండలం జమ్లంలో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. బంగారం, వెండి ఆభరణాలు అపహరించినట్లు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. గ్రామానికి చెందిన కుమ్మరి నరసయ్య తన ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లగా శనివారం అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి 3 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కొత్తగూడెం-జగ్గయ్యపేట రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించండి

**● ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**




కొత్తగూడెం జూన్ 21 (జన సంఘర్షణ)
తెలంగాణలోని పారిశ్రామిక, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కొత్తగూడెం నుండి జగ్గయ్యపేట వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రికి కూడా ప్రత్యేకంగా లేఖలు సమర్పించారు. దాదాపు 100 కిలోమీటర్ల పొడవున్న ఈ రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారానే ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధి వేగంగా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కూనంనేని తన లేఖలో స్పష్టం చేశారు. ఈ రోడ్డు విస్తరణ అనేది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదని, పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చే ఒక వ్యూహాత్మక అనుసంధానమని ఆయన అభివర్ణించారు. కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా ఉన్న బొగ్గు గనులు, పరిశ్రమల నుండి రవాణా సజావుగా సాగడానికి ఈ మార్గం ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జాతీయ రహదారిగా మారితే భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, బొగ్గు రవాణా మరింత వేగంగా మరియు సురక్షితంగా జరుగుతుందని కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి పుణ్యక్షేత్రానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు కూడా ఈ రహదారి అభివృద్ధి ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని కూనంనేని వివరించారు. దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందించడానికి ఈ రోడ్డు నవీకరణ ఎంతో అవసరమన్నారు. తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాల ఆర్థిక పురోగతికి ఈ ప్రతిపాదిత జాతీయ రహదారి ఒక వెన్నుముకలా మారుతుందని ఎమ్మెల్యే సాంబశివరావు ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం రవాణా రంగానికే పరిమితం కాకుండా, వెనుకబడిన గిరిజన గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడానికి, వ్యాపార లావాదేవీలు విస్తరించడానికి ఇది తోడ్పడుతుందని లేఖలో పొందుపరిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, తక్షణమే నిధులు మంజూరు చేయాలని, కొత్తగూడెం-జగ్గయ్యపేట రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రజాక్షేత్రంలో ఉద్యమించడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు.

## అబాలపూర్ గ్రామంలో ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు

**● 2 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, స్కూల్ ప్రహరీకి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 21 (జన సంఘర్షణ)
మెదక్ పాపన్నపేట్ మండలం అబాలపూర్ గ్రామానికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు రాగా గ్రామ ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులతో, పూలదండలతో ఎమ్మెల్యే గారికి స్వాగతం తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్ రావు గ్రామంలో 2 ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. కొత్త ఇంట్లోకి అడుగుపెట్టిన కుటుంబాలను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్యార్థుల భద్రత, స్కూల్ అభివృద్ధి తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.లబ్ధిదారులు మాట్లాడుతూ. "మాకు పక్కా గృహం ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు. పూరిగుడిసెలో ఉండే మాకు సొంత ఇల్లు ఇచ్చి ఆదుకున్నారు. ఇది మా జన్మలో మరచిపోలేని రోజు" అని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్, గ్రామ పెద్దలు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## పశువుల దొంగల అంతర్రాష్ట్ర ముఠా భేద్యం

**● 13 మంది నిందితులపై కేసు, ఐదుగురు అరెస్ట్**




ఆదిలాబాద్/జూన్ 21/(జనసంఘర్షణ)
ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అంతర్రాష్ట్ర పశువుల దొంగతనాల ముఠాను ఛేదించారు. గత ఒకటిన్నర సంవత్సరంగా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న 13 మంది నిందితులపై కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ ముఠాలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నారని, కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఒక పత్రికా సమావేశంలో వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితుల నుండి ఒక కారు, ఐదు సెల్ ఫోన్లు, నకిలీ నంబర్ ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో మహారాష్ట్రకు చెందిన మహమ్మద్ షాహిద్ హబీబ్ ఖాద్రి (భివండి, థానే), ఆలం షేక్ అనీష్ (కళ్యాణి అన్సారి చౌక్, ముంబై), ఫర్మాన్ సబీర్ షేక్ (రాజీవ్ గాంధీ నగర్, ముంబై), షేక్ తబాస్ షకీల్ (కళ్యాణ్ వెస్ట్, థానే), వసీం ఖురేషీ (భివండి, థానే) ఉన్నారు. ఈ ఐదుగురిపై గతంలో కూడా పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో పరారీలో ఉన్న మరో ఎనిమిది మంది నిందితులు రహీమ్, మొండ్ ముర్తుజా ఏ అల్తాఫ్, అజీమ్ రౌఫ్ గాజీ ఏ అజ్జు (మహారాష్ట్రకు చెందినవారు), నబీ బిల్డర్ (పశువధశాలకు తరలించే వ్యక్తి), తౌకీర్, పాపు తాండా, బాబు ఏ సయ్యద్ సమీర్, ఖయ్యూమ్ బటారియా (ఉత్తరప్రదేశ్) కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ కేసు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో Cr.No: 394/26 U/Sec. 303(2), 318(4), 336(3) BNS & Sec. 5 of the Telangana Prohibition of Cow Slaughter And Animal Preservation Act-1977, section 11, prevention of cruelty to animals act 1960 క్రింద కేసు నమోదైంది. ఈ ముఠా సభ్యులు రాత్రిపూట ఎస్యూవీ, ఇన్నోవా వాహనాల వెనుక సీట్లు తొలగించి, పశు వులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి వాహనాల్లోకి ఎక్కించి మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతంలోని వధశాలలకు తరలించేవారు. అక్కడ అక్రమంగా మాంసం విక్రయించి భారీగా లాభాలు పొందుతున్నారని విచారణలో తేలింది. నిందితులు తమ వాహనాలకు నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చుకొని, టోల్ ప్లాజాలు, చెకోపోస్టులు లేని మార్గాలను ఎంచుకుని పోలీసుల కంట పడకుండా జాగ్రత్త పడేవారు. గత ఒకటిన్నర సంవత్సరంలో ఈ ముఠా ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు (3), తాంసి (1), జైనథ్ (1), ఆదిలాబాద్ వన్టౌన్ (1), ఆదిలాబాద్ టూ టౌన్ (1) పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఏడు పశువుల దొంగతనాలకు పాల్పడింది. నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల జిల్లాలలో కూడా ఈ ముఠాపై కేసులు నమోదై ఉన్నాయి. అందిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజీలు, వాహనాల కదలికలు, నిందితుల కాల్ డేటాను విశ్లేషించడం ద్వారా ఈ కేసును ఛేదించడంలో ఆదిలాబాద్ జిల్లా పోలీస్ ప్రత్యేక బృందం కీలకపాత్ర పోషించిందని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ పశువులను రాత్రి వేళల్లో సురక్షిత ప్రదేశాలలో కట్టివేయాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈకార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ గోపికృష్ణ, ప్రణయ్, అఖిల్ సిబ్బంది నరేష్, క్రాంతి, త్రిశూల్, రాథోడ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.







Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co